# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## కాణిపాకంలో పోటెత్తిన భక్తుల రద్దీ

కాణిపాకం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:



దీపావళి వరుస సెలవులతో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయంలో సాధారణంగా వారాంతపు రోజుల్లో తీవ్ర స్థాయిలో భక్తుల రద్దీ వుంటుంది. ఈమేరకు దీపావళి సందర్భంగా వరుస సెలవులు రావడంతో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాలనుండి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు స్వామివారికి మొక్కుబడులు తీర్చుకునేందుకు కాణిపాకం ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. దీనితో ఉదయం నుండి రాత్రి వరకు భక్తజన సందోహంతో కాణిపాకం ఆలయం కిక్కిరిసింది.

## శ్రీవారి సేవలో లండన్ వాసులు

తిరుమల, అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి చెంత భక్తులకు ఇతోధిక సేవలందించేందుకు తొలిసారిగా విదేశాలకు చెందిన మహిళ భక్తులు శ్రీవారిసేవకు వచ్చారు. 11మంది సభ్యులు లండన్‌లో ఉంటూ ఆన్‌లైన్‌లో శ్రీవారి సేవకు బుక్‌చేసుకుని ఇక్కడ నాలుగురోజులుగా సేవలందిస్తున్నారు.



## మంత్రి కాన్వాయికి
# తప్పిన ప్రమాదం

**జాతీయ రహదారిపై ఆటో - ద్విచక్రవాహనం ఢీ**
**ప్రమాదాన్ని గుర్తించేలోపు ఆటోను ఢీ కొన్న ఎస్కార్ట్ వాహనం**



ప్రమాదానికి గురైన టాటాఎస్ వాహనం, ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

పెద్దపంజాణి, అక్టోబర్ 22, ప్రభాతవార్త:
మంత్రి ప్రయాణిస్తున్న కాన్వాయికి పెనుప్రమాదం తప్పింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనలో భాగంగా పుంగనూరు నుండి పలమనేరు వైపు వస్తుండగా పెద్దపంజాణి మండల కేంద్ర సమీపంలో తృటిలో ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పుంగనూరు నుండి పలమనేరు వైపు ఓ టాటాఏస్ వాహనం వస్తున్న క్రమంలో ముందు వైపు ప్రయాణిస్తున్న రెండు ద్విచక్రవానాలను తప్పించే క్రమంలో ఓ ద్విచక్రవాహనాన్ని ఢీ కొని అదుపుతప్పి కల్వర్టును ఢీ కొని ఆగిపోయింది. అప్పటికే మంత్రి కాన్వాయి సంఘటన స్థలానికి రావడం ప్రమాదాన్ని గుర్తించేలోపు ఆ టాటాఎస్ వాహనాన్ని కాన్వాయిలోని మొదటి వాహనం ఢీ కొంది. దీంతో అప్రమత్తమైన మిగిలిన కాన్వాయిలోని వాహనాలు ఒక్కసారిగా ఆపివేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఆటో ఢీ కొన్నడంతో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న బ్రాహ్మణపల్లెకు చెందిన సుబ్రమణ్యం(30) సంఘటన స్థలంలోనే మృతి చెందగా, మిట్టపల్లుకు చెందిన ఆనంద్ (45)తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనను గుర్తించిన మంత్రి ఘటన స్థలాన్ని పరిశీలించి గాయపడ్డ వ్యక్తిని 108 ద్వారా ఆసుపత్రికి తరలించి, మృతి చెందిన సుబ్రమణ్యం మృతదేహాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 30 నిమిషాల పాలు సంఘటన స్థలం వద్ద ఉన్న ఆయన గాయపడ్డ వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని, మృతుడి కుటుంబానికి సహాయం అందించాలని స్థానిక నాయకులకు సూచించిన అనంతరం ఆయన వెళ్లారు. ఈ ప్రమాదంపై మృతుడి సోదరుడు క్రిష్ణమూర్తి (25)ఫిర్యాదు మేరకు సిఐ అశోక్‌కుమార్, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, పెద్దపంజాణి ఎస్ఐ స్వర్ణతేజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# షార్‌లో సందడే సందడి

**- అర్ధరాత్రి దాకా ఆనందంగా ఎదురు చూపులు - షార్‌తో పాటు సమీప గ్రామాల ప్రజల్లోనూ ఆసక్తి**
**- సూళ్లూరుపేట-షార్ మార్గంలో అడుగడుగునా తనిఖీలు - స్వదేశీ విదేశీ శాస్త్రవేత్తలతో నిండిపోయిన షార్**





రాకెట్ వీక్షణకు షార్‌కు తరలివచ్చిన సందర్శకులు

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 22 ప్రభాతవార్త
అర్ధరాత్రి రాకెట్ ప్రయోగం కావడంతో షార్ అంతా సందడి నెలకొంది. శనివారం సాయంత్రం నుంచి జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్ ప్రయోగ వీక్షణకు అంతా ఉత్సాహ పడుతున్నారు. శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి 36 కమ్యూనికేషన్ శాటిలైట్లను మోసుకెళ్లే జీఎస్ఎల్‌వీ మార్క్3 (ఎల్‌వీఎం3-ఎం2) రాకెట్ ప్రయోగం కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఇక ఈ రాకెట్ ప్రయోగం జరుగుతున్న ప్రదేశంలో ఉత్సాహం చెప్పనక్కరలేదు. బాహుబలిగా పేరున్న ఈ అతిపెద్ద రాకెట్ రాత్రి పూట దూసుకెళితే ఆ వెలుగులు అత్యంత స్పష్టంగా కనిపిస్తాయని శ్రీహరికోటతో పాటు సమీప గ్రామాల ప్రజలు కూడా ఎదురు చూస్తూ కనిపించారు. దీనికితోడు షార్‌లో వీక్షకుల గ్యాలరీ సిద్ధం చేయడంతో శనివారం సాయంత్రం నుంచి ఆ పరిసర ప్రాంతాల్లో చిన్నారుల కేరింతలు సందడి నెలకొంది. షార్ అధికారులు సందర్శకుల కోసం కొన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన వీక్షకులు షార్ ప్రధాన గేటుకు సమీపం నుంచే పులికాట్ తీరంలో వేసిన రోడ్డుపై వీక్షకుల గ్యాలరీ చేరుకున్నారు. మరోవైపు మీడియా సెంటర్‌లో ఈ రాకెట్ ప్రయోగం కోసం ఉత్కంఠగా మీడియా ప్రతినిధులు ఎదురు చూశారు. ఇంకోవైపు మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు యూకేకి చెందిన ఈసా శాస్త్రవేత్తలు, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ అధికారులు, వన్‌వెబ్ కంపెనీ ప్రతినిధులు ఆశీనులయ్యారు. ఈసారి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలతో రాకెట్ ప్రయోగం జరుగుతున్న కారణంగా అందరి కళ్లు శ్రీహరికోట వైపే ఉన్నాయి. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్, భారతి ఎంటర్‌ప్రైజస్ ఫౌండర్ మరియు ఛైర్మన్ సునీల్‌భరతి మిట్టల్, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.రాధాకృష్ణన్ ఈ రాకెట్ ప్రయోగం నేపథ్యంలో తమ సందేశాలు అందించడమే కాకుండా ప్రయోగ విజయాన్ని ఆకాంక్షించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, దేశంలోని ఇతర ఇస్రో కేంద్రాల ప్రతినిధులు జీఎస్ఎల్‌వీ మార్క్3 ప్రయోగంపై ఆసక్తి చూపించారు.

## 25న శ్రీవారి ఆలయం మూసివేత

**-విఐపి బ్రేక్‌దర్శనాలకు సిఫార్సులేఖలు తేవద్దు**



తిరుమల, అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:
రానున్న మంగళవారం 25వతేదీ అమవాస్య సూర్యగ్రహణం కారణంగా తిరుమల ఆలయాన్ని మూసివేస్తున్న టిటిడి, ఆ రోజు అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలు, శ్రీవాణి దర్శనాలు, ఆర్జితసేవలను రద్దుచేసింది. గ్రహణం సంభవించడానికి ముందు 12గంటలు పాటు నిరవధికంగా మూసివేస్తారు. 25వతేదీ మంగళవారం సాయంత్రం 5.11 గంటల నుంచి రాత్రి 6.27గంటల వరకు సూర్యగ్రహణం ప్రభావం ఉంటుంది. ఈ కారణంగా ఉదయం 8.11గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయ తలుపులు మూసివేస్తారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, ఇతర ప్రాంతాల్లో అన్నప్రసాద వితరణ ఉండదు. ఆలయంలో 24వతేదీ సోమవారం దీపావళి పర్వదినం సందర్భంగా దీపావళి ఆస్థానం జరుగుతుంది. ఈ కారణంగా సోమవారం విఐపి బ్రేక్ దర్శనం రద్దుచేయడంతో నేడు సిఫార్సు లేఖలు కూడా స్వీకరించరు. 25న సూర్యగ్రహణం కారణంగా విఐపి దర్శనాలు రద్దుతో 24న కూడా సిపార్సులేఖలు తీసుకోబడవని టిటిడి తెలిపింది.

## మార్క్3 విజయం కోసం ఇస్రో ఛైర్మన్ అమ్మణ్ణికి పూజలు

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 22 ప్రభాతవార్త



శ్రీహరికోట నుంచి జరుగుతున్న జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్ విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ శనివారం ఉదయం సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. ఉదయం 6.30 గంటలకే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఛైర్మన్ ఆలయానికి చేరుకున్నారు. ఆయనకు కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంకా దినేష్, అర్చకులు, సిబ్బంది సోమనాథ్‌తో పాటు ఆయన వెంట వచ్చిన ఎంఎస్‌ఏ గ్రూప్ డైరెక్టర్ టి.గోపీకృష్ణలకు సాదర స్వాగతం పలికారు. మొదట ఇస్రో ఛైర్మన్ ఆలయం లోపల ఉన్న వినాయకుని దర్శించుకొని తర్వాత వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేశారు. అనంతరం శ్రీచెంగాళమ్మ మూలవిరాట్ వద్ద జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్ నమూనా ఉంచి భక్తిగా ప్రార్థించారు. ఈఓ ఆధ్వర్యంలో ఛైర్మన్‌కు తీర్థప్రసాదాలు అందించారు.

## ఇంటింటా వైద్యం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభం



బీపీ చెక్ చేయించుకుంటున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

రేణిగుంట, అక్టోబరు 22 ప్రభాతవార్త:
ఇంటింటా వైద్యం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమం తిరుపతి జిల్లాలో 33 గ్రామాల్లో శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ శ్రీనివాసపురం, కరకంబాడి గ్రామాల్లో ఇంటింటా వైద్యం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సచివాలయంలో పరిధిలో నెలకు రెండు సార్లు 104 వాహనం ద్వారా ఇంటింటికి వైద్యం నిర్వహిస్తారని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాధారణ జబ్బులైన బీపీ షుగర్ తదితర జబ్బులకు నెలకు సరిపడ మందులను అందిస్తామన్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో కనీసం మూడు నెలలకు సరిపడ మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపీ చూస్తారని, పాఠశాలల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గర్భవతులు, పిల్లలకు, తల్లులకు ఏనీమియా తదితర పరీక్షలు నిర్వహించి మధ్యాహ్నం ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేయబడిన దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్ద పరీక్ష చేసి మందులు ఇస్తారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బీపీ పరీక్షలు చేయించుకున్నారు. వైద్యసేవలో పాల్గొన్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నోడల్ ఆఫీసర్ హనుమంతరావు ,డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధారాణి, రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో హరిబాబు, డాక్టర్ చంద్రప్రకాష్‌రెడ్డి, డాక్టర్ పవిత్ర, ఏఎన్ఎం లలిత, ఆశ రమాదేవి, 104 నవీన్, సూపర్‌వైజర్ సరస్వతమ్మ, డిప్యూటీ డీఎంహెచ్ సుధారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు రోజా, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్నకు పవిత్ర సమర్పణ

చంద్రగిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి శనివారం పవిత్ర సమర్పణ గావించారు. కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు, కంకణదారులు బాలాజీ రంగాచార్యులు ఆధ్వర్యంలో ఆగమోక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి వారిని వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. యాగశాల వైధిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ అంగరంగ వైభవంగా జరిపించారు. పాలు, పెరుగు, కొబ్బరినీళ్ళు, తేనె, పుసుపు, చందనంతో అభిషేకం జరిపించారు. అనంతరం మూలవర్లకు, ఉత్సవర్లకు, గరుడాళ్వార్, విమానగోపురానికి, పరివార దేవతలకు, ధ్వజస్థంభానికి శ్రీ ఆంజనేస్వామి వారికి శాస్త్రోక్తంగా పవిత్రాలు సమర్పి ంచారు. సాయంత్రం 5 గంటల నుండి వీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలక మండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెట్ మునిచెంగల్రాయులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌వీపురం టోల్‌గేట్‌లో తమిళ విద్యార్థులు హల్‌చల్





వడమాలపేట, అక్టోబరు 22 ప్రభాతవార్త:
తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలోని వడమాలపేట మండల పరిధిలోని ఎస్‌వీ పురం టోల్ ప్లాజా వద్ద తమిళనాడుకు చెందిన లా స్టూడెంట్స్ శనివారం హల్‌చల్‌చేశారు. టోల్‌గేట్ చెల్లించాలని అడిగిన సిబ్బందిపై దాడి చేశారు. గంటపాటు విద్యార్థుల దౌర్జన్య కాండ కొనసాగింది. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. తమిళనాడుకు చెందిన న్యాయ విద్యార్థులు తమ వామనాల్లో టోల్‌ప్లాజా వద్దకు రాగా ఫాస్టాగ్ పనిచేయకపోవడంతో టోల్ సిబ్బందికి, న్యాయ విద్యార్థులకు వాగ్వాదం జరిగింది. విద్యార్థులు తమను టోల్‌గేట్‌లో నిలిపి వేశారని స్నేహితులకు, బంధువులకు చెప్పడంతో వారు వాహనాల్లో 100 మందికి పైగా టోల్ ప్లాజా వద్ద చేరుకుని టోల్ సిబ్బందిపై దాడి చేశారు. ఇతర వాహనాలను కూడా వెళ్ళకుండా అడ్డుకోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థులకు సర్దిచెప్పడానికి ప్రయత్నం చేసినా వారు వినకపోగా వచ్చిపోయే వాహనదారులపై దౌర్జన్యం చేశారు. దీంతో అప్పటి వరకు ఓపీగా ఉన్న టోల్ సిబ్బంది, స్థానికులు విద్యార్థులు వారి అనుచరులపై తిరగబడి తరిమికొట్టారు. ఈ ఘర్షణలో ఇరువర్గాల్లో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటనలో పలు వాహనాల అద్దాలు పగులగొట్టారు.

**చిన్న వివాదం ఘర్షణకు దారి తీసింది - ఎస్ఐ**

టోల్‌ప్లాజా వద్ద చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసిందని వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మీకు అన్యాయం జరిగి ఉంటే ఫిర్యాదు చేయమని విద్యార్థులకు సర్ది చెప్పినా వినలేదని ఘర్షణ పడ్డారన్నారు. చివరకు అదనపు సిబ్బందిని రప్పించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు.

## ముక్కంటీశుని ఆలయంలో భక్తుల రద్దీ

**రికార్డు స్థాయిలో అభిషేకాలు**
**యధేచ్ఛగా మధ్యవర్తుల దందా**
**సామాన్య భక్తులకు తప్పని తిప్పలు**

శ్రీకాళహస్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి లెక్కలేనంత మంది అతిధులు వస్తున్నారు. దాంతో ఈ ఆలయానికి భక్తి శ్రద్దలతో వచ్చే భక్తుల దర్శనం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. అతిధుల ముసుగులో కొందరు తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఆలయాధికారి ఏమో మధ్యవర్తులను కట్టడి చేయటానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు కానీ పేరుకు సంస్కరణలు, రికార్డులు, నమోదులు. అయితే మధ్య వర్తుల దందా యథేచ్ఛగా సాగుతుంది. ఇక్కడి ఆలయంలో లెక్కకు మించి ఎపిఆర్‌ఓలు ఉండటంతో ఎవరు ఎవరిని దర్శనాలకు తీసుకెళుతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. శనివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు 23వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. ఉదయం రాహుకాల సమయంలో శనీశ్వరస్వామి ఆలయం వద్ద కిటకిటలాడారు. అలాగే ప్రత్యేక రాహు కేతుదోష నివారణ పూజలకు భక్తులు కిక్కిరిసి కనబడ్డారు. అయితే నిత్యం ఇఓ వికె సాగర్‌బాబు ఆలయంలో పరిశీనలు జరుపుతున్నారు. రాహుకేతు దోష నివారణ మండపాల్లో నిఘా పెట్టారు. అయితే దళారుల దందా కొనసాగుతూనే ఉంది. దొడ్డిదారి పూజలు నిరాటంకంగా సాగుతున్నాయి. ఓ వైపు అధికారులు నిబంధనలు ఉల్లఘించినారంటూ 'సస్పెషన్లు' చేస్తునే ఉన్నారు. అయినా ఇక్కడ కట్టడి కావటం లేదు. సామాన్య భక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది.

**అభిషేకాల్లో రద్దీ రద్దీ రద్దీ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం నిర్వహించే శనీశ్వరస్వామిఅభిషేకాలకు భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. ఉదయం నుంచే కాకుండా సాయంత్రం నిర్వహించే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలకు రద్దీ ఏర్పడుతుంది. దాంతో అభిషేకాలకు హాజరయ్యే భక్తులు అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. సోమవారం కూడా అభిషేకాలకు సొమ్ములు చెల్లించిన వారు రన్నింగ్ క్యూతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. సాయంత్రం అభిషేకాలకు కూడా ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది.



## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

– తెలుగుదేశం నాయకులు డిమాండ్

పెనుమూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

మండలంలో ప్రభుత్వ భూములతో పాటు బలహీన వర్గాలు దరఖాస్తు చేసుకొన్న భూములను రెవెన్యూ అధికారులు పరిరక్షించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పెద్దినేని రుద్రయ్యనాయుడు డిమాండ్ చేశారు. ఆయన శనివారం దేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వైకాపా నాయకుల అధికార బలానికి తలొగ్గి నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూ పంపిణీ జరుగకుండానే పట్టాలు పంపిణీ చేశారని ఇది దారుణమన్నారు. మండలంలో సుమారు 300 ఎకరాల భూమిని అధికార వైకాపా నాయకులు ఆక్రమించుకొన్నారని, ఈ విషయమై డిప్యూటీ సిఎం నారాయణస్వామి పెనుమూరులో వైకాపా నాయకులు చేస్తున్న భూదందాపై విచారణకు ఆదేశించి భూములను పరిరక్షించాలని ఆయన కోరారు. సమావేశంలో దేశం నాయకులు లోకనాధనాయుడు, భాస్కర్‌నాయుడు, తలారి రెడ్డప్ప, మంగళూరు కిషోర్‌నాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌ను కలిసిన దేవరాజులు

గుడిపాల, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

సావర్కర్ ట్రస్ట్ ఛైర్మన్, బిజెపి నాయకులు దేవరాజులు విజయవాడలో శనివారం మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన డైరెక్టర్‌తో మాట్లాడుతూ మండలంలో అక్రమ మైనింగ్‌లను పూర్తి స్థాయిలో కట్టడి చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అనంతరం దేవరాజులు ఆయనను సన్మానించారు.

## విద్యార్థులకు పెన్నులు పంపిణీ

పూతలపట్టు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

మండల పరిధిలోని రంగంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన మనోజ్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు పెన్నులు, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గత సంవత్సరంలో తన కుమారుడు మనోజ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతోఅతనిజ్ఞాపకార్థంపాఠశాలలోని120మంది విద్యార్థులకు సహాయం చేస్తున్నామని మనోజ్‌కుమార్ తండ్రి పురుషోత్తం, తల్లి అంజలిలు పేర్కొన్నారు. హెడ్మాస్టర్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడుగా నూర్ అహ్మద్

బంగారుపాళ్యం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

మండల పరిధిలోని గ్రామ సచివాలయాల ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడిగా తిమ్మోజిపల్లి సచివాలయ కార్యదర్శి నూర్ అహ్మద్ ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో నూతన కార్యవర్గ ఎన్నిక ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో జరిగింది. అలాగే ఉపాధ్యక్షులు కుమార్, మనోజ్‌కుమార్, కార్యదర్శిగా వినయ్‌కుమార్, కోశాధికారిగా రెహమాన్‌లు ఎన్నికయ్యారు. అలాగే నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మహిళా విభాగ అధ్యక్షురాలు రోజామణి, నియోజకవర్గ కోశాధికారి రాంబాబులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంను పలువురు సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

## అరాచకానికి కేరాఫ్ అడ్రస్ వైకాపా పాలన

– జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' సమన్వయకర్త చిట్టిబాబు

పాలసముద్రం, అక్టోబర్ 22 ప్రభాతవార్త:



రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన అరాచక పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని గంగాధరనెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త భీమినేని చిట్టిబాబు ధ్వజమెత్తారు. పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా అరాచక పాలనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైకాపా అరాచక పాలనతో రాష్ట్రంలో తెలుగుతల్లి రోదిస్తోందన్నారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలు కావడం లేదని రాజ్యాంగం పౌరులకు ఇచ్చి నహక్కులనుకాలరాస్తున్నారనిధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు అయ్యిందని ఆరోపించారు.

## రాష్ట్రంలో అరాచక పాలన.. అభివృద్ధి అటకెక్కింది

కుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త



రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, అభివృద్ధి అటకెక్కిందని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నేతల సమావేశంలో వారు మాట్లాడారు. సిఎం జగన్‌రెడ్డి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఇప్పటికే 35వేలకు పైగా నేరాలు రాష్ట్రంలో జరిగాయన్నారు. న్యూడ్ వీడియోలు కాల్ చేసిన ఎంపి, అరగంట, గ ంట రమ్మన ్న మంత్రులను సిఎం వెనకేసుకురావడం దారుణమన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగాయని, పన్నులతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. రైతుల పాదయాత్రను అడు ్డకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, బాబు నాయుడు, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై సత్వరం స్పందన

– అధికారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశం

గుడిపాల, అక్టోబర్ 22 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలపై అధికారులు సత్వరం స్పందించి పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. ఎంపిపి ప్రసాద్ అధ్యక్షతన శనివారం గుడిపాల ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల, ప్రజల నుండి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో చిత్తపార గ్రామంకు ప్రస్తుతం ఒకే ఆర్టీసీ సర్వీసు నడుస్తోందని, అది కూడా వారంలో మూడు రోజుల పాటు రావడం లేదని ఎంపిటిసీ గోపి పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చిత్తపార గ్రామంకు రోజు సజావుగా ఆర్టీసీ నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మండలంలో ట్రాన్స్‌కోకు సంబంధించి పలు సమస్యలు వున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని సభ్యులు ఆరోపించారు. సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిడిఓ ఉపేంద్ర, తహసిల్దారు బాబురాజేంద్రప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలు కాపాడేందుకే ప్రాధాన్యత

కుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త



అగ్ని, నీటి ప్రమాదాలు సంభవించినపుడు ప్రజల ప్రాణాలు కాపాడేందుకే ఎన్‌డిఆర్‌ఎఫ్ ప్రాధాన్యత ఇస్తుందని విజయవాడ ఎన్‌డిఆర్‌ఎఫ్ సిఐ దీపక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలికల హైస్కూల్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం స్కూల్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించింది. సిఐ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే సమయంలో ప్రజల రక్షణకోసం ఎన్‌డిఆర్‌ఎఫ్ బలగాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయన్నారు. ఈసందర్భంగా గతంలో తమ బృందాలు వివిధ సంఘటనల్లో ప్రజల ప్రాణాలు కాపాడిన తీరును వినియోగించే పరికరాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్‌బాబు, ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం వెంకటేష్‌బాబు, విఆర్వో కృష్ణమూర్తి, ఫైర్ సిబ్బంది రామూర్తి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నేత మంజునాథ్‌చే భారీ ఎత్తున అన్నదానం

కుప్పంరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మంజునాథ మెగా హోమ్ నీడ్స్ అధినేత వి.సి. మంజునాథ్ కుప్పంలో శనివారం పెద్ద ఎత్తున అన ్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన కుమారుడు సూర్య జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్న క్యాంటీన్ ద్వారా అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్, కంగుంది సర్పంచ్ ధనశేఖర్, ఆర్ఆర్ రవి, హిదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి సిడిపిఓపై చర్యలు చేపట్టాలి

కుప్పంరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త



కుప్పం ఐసిడిఎస్ సిడిపిఓపై చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం ప్రమీల అధ్యక్షతన స్థానిక రాజావారి పార్కులో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావే శంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఐసిడిఎస్ వ్యవస్థను నిర్వీర్య ం చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఐసిడిఎస్‌ను ప్రైవేట్ పరం చేయాలని చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలకడం తగదన్నారు. కుప్పం ప్రాజెక్టు అధికారిణి వేధింపులకు గురిచేస్తున్నారని దీనిపై ఇప్పటికే పిడికి ఫిర్యాదు చేసామన్నారు. ప్రతి చిన్న పనికి కమీషన్లు అడుగుతున్నారని ఇలాంటి అవినీతి అధికారిపై చర్యలు తీసుకోకుంటే బుధవారం నుంచి ఆందోళన చేపడ్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ప్రమీల, కార్యదర్శిగా లలిత, కోశాధికారిగా కస్తూరి, ఉపాధ్యక్షులుగా శారదతో పాటు 21మందితో కమిటీని ఎన్నుకున్నారు.

## పేదల సంక్షేమమే సిఎం లక్ష్యం – ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త



పేదల సంక్షేమమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు శనివారం కెంచనబల్ల పంచాయతీలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల ఇళ్ల వద్దకే నేరుగా వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులకు తప్పక ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. ఎమ్మెల్సీకి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, కో ఆప్షన్ బర్కతుల్లా, కోశాధికారి కేశవరెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిటిసి చలపతి, నేతలు మంజునాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మురుగేష్, సుబ్రమణ్యం, శివ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పర్యావరణ రహిత దీపావళి జరుపుకుందాం

గంగాధర నెల్లూరు, అక్టోబరు 22 ప్రభాతవార్త:

మండలంలోని సుందరరాజుపురం వద్ద వున్న విశ్వం విద్యార్థులు శనివారం మండల కేంద్రం లోనితహశీల్దారు కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ ఎంపిడిఓ కార్యాలయం మీదుగా బస్టాండు కూడలి వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. పర్యావరణానికి హాని చేసే బాణా సంచాలను నిషేధించాలని, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కరస్పాండెంట్ జయచంద్రా రెడ్డి, ఎస్.ఐ శ్రీనివాసులు, ఇఓపిఆర్‌డి శివయ్య, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, ప్రిన్సిపల్ చిట్టిబాబు ఉపాధ్యాయులు భారతి, భువనేశ్వరి లతో పాటు పలువురు అధివారులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకునేందుకు గ్రామ సభలు

సదుం, అక్టోబరు22 ప్రభాతవార్త



మండల పరిధిలో నిర్మిస్తున్న ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులను ఆదుకునేందుకే గ్రామసభలు నిర్వహిస్తు న్నట్లు జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మొరవపల్లె పంచాయతీ గంటావారిపల్లెలోను, ఊటు పల్లె పంచాయతీ మద్దెలవారిపల్లెలోను ఏర్పాటు చేసిన గ్రామ సభలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటావారిపల్లె వద్ద, ఊటుపల్లె వద్ద నిరి ్మ స్తున్న ప్రాజెక్టుల కింద ఉన్న రైతులతో పలమనేరు ఆర్‌డిఓ శివయ్య ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిం చారు. భూములు కోల్పోయిన రైతులకు త్వరలో నష్టపరిహారం పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నామని తెలిపారు. సమావేశాల్లో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, తహశీల్దారు చంద్రశే ఖర్, ఆర్‌ఐ ప్రసాద్, సర్పంచిలు జగన్నాథం, వెంకటరమణ, శ్రీనివాసులురెడ్డి, రెడ్డెమ్మ, వీఆర్వోలు బాలాజీ, చలపతి, రామస్వామి, సచివాలయ కార్యదర్శులు లోకేష్, సర్వేయర్‌లు నేతాజీ ,ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున, స్వరూప, మాజీసర్పంచిలువెంకటరెడ్డి, రామచంద్ర, సురేంద్రరెడ్డి, గుణాకరరెడ్డి, మురళీమోహన్ నాయుడు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

కల్లూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త



పులిచెర్ల మండలం కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ సురేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోనిఅన్నిపాఠశాలలకు చెందిన అండర్–14, అండర్–17 వయసులలో మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల ్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్ ్స, యోగా విభాగాల నుంచి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనపరచిన వారికి ఈనెల 26 నుంచి నియోజక వర్గ స్థాయిలో జరిగేపోటీలలో అవకాశం కల్పిస్తారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యతోపాటు వారికి నచ్చిన క్రీడల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు. కార్యక్రమాల్లో ఎంఈఓ సిద్ధరామయ్య, ప్రధానోపాధ్యాయులు పోకల తాతయ్య, వ్యాయామ సంచాలకులు జయచంద్ర, విమలా విక్టోరియా, బరాక్‌తుల్లా, పార్థసారధి, కాణిపాకం ఆలయ ట్రస్టు సభ్యులు మువ్వల నరసింహులుశెట్టి, సర్పంచిలు షుకూర్, నటరాజ, కోదండయ్య, ఎంపీటీసీ రెడ్డి బాబుల్లా, షౌకత్‌ఆలీ, విద్యాకమిటీ చైర్మెన్ రఫి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీరమణ, నాదమునిరెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ్ ఫౌండేషన్‌చే క్రీడా సామగ్రి వితరణ

కుప్పంరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త



కళ్యాణ్ ఫౌ ండేషన్ ఛైర్మన్ డా॥ పవన్ కళ్యాణ్ అధ్వర్యంలో శనివారం నడిమూరు మోడల్ స్కూల్ విద్యార్థులకు కుప్పం అర్బన్ సిఐ శ్రీధర్ చేతుల మీదుగా క్రీడా సామగ్రిని అందించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కళ్యాణ్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై రామలక్ష్మిరెడ్డి, ప్రిన్సిపాల్ హరిణి, ఫౌండేషన్ బృందం సుబ్రమణ్యం, డా॥ కిరణ్‌కుమార్, హరీష్, బాలసుబ్రమణ్యం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లు ప్రారంభం

తడ, అక్టోబర్ 22 ప్రభాతవార్త



తడ కండ్రిగ మేజర్ పంచాయతీ పరిధిలోని అనపగుంట, మదీనా కాలనీలలో శనివారం సిమెంటు రోడ్లను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల ఉన్న గ్రామాలకు కూడా సిమెంటు రోడ్లు వేస్తూ జగనన్న ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రఘురెడ్డి, సర్పంచ్ జయప్రద, పంచాయతీరాజ్ డీఈ రమణయ్య, ఏఈ వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు మునుస్వామిరెడ్డి, మునీష్‌రెడ్డి, రవిరెడ్డి, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, హుస్సేన్, వరాలబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

కోట, అక్టోబర్ 22 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారుతుందని, ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని కోట మండల తహశీల్దార్ పద్మావతి సూచించారు. ఆమె శనివారం ఆ మేరకు క్రిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తీరప్రాంత గ్రామమైన కొత్తపట్నం పంచాయతీలోని వీఆర్‌ఓలను, సంబంధిత శాఖలను అప్రమత్తం చేశారు.

## ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్

కోట, అక్టోబర్ 22 ప్రభాతవార్త




తెల్లదొరల కబంధ హస్తాల నుంచి భారతమాతకు విముక్తి లభించి 75 వసంతాలైన సందర్భంగా కేంద్రప్రభుత్వం 75 వారాల పాటు తలపెట్టిన సంరంభం కార్యక్రమంలో భాగంగా మూడో విడత ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ కార్యక్రమాన్ని శనివారం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోనావెల్ యూనిట్ అధికారిడాక్టర్ పి.మల్లి కార్జునరెడ్డి, ఆర్మీ ఎన్‌సీసీ అధికారి జి.మాధవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరు కళాశాల క్రీడాసముదాయం నుంచి పరుగును ప్రారంభించి విద్యానగర్‌లోని గాంధీబొమ్మ సెంటర్ వరకు చేరుకున్నారు. ఇందులో 3 కిలోమీటర్ల పరుగులో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో నడక, పరుగు, వ్యాయామం ఎంతో అవసరమని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయాలని కోరారు.

## మందకొడిగా ఎంఎల్‌సీ ఓటర్ల నమోదు

కోట, అక్టోబర్ 22 ప్రభాతవార్త

తూర్పురాయలసీమ ఎంఎల్‌సీ, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోంది ఫారం–18 ద్వారా పట్టభద్రులు, ఫారం–19 ద్వారా ఉపాధ్యాయులు నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ లేదా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 1వ తేదీ నుంచి నమోదు ప్రక్రియ మొదలైంది. నవంబర్ 7న తుది గడువుగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఇప్పటికే 22 రోజులు గడిచిపోయాయి. మూడు జిల్లాలోని 36 నియోజకవర్గాల్లో ఆశించిన మేరకు పట్టభద్రుల ఓట్లు నమోదు వేగవంతం కాలేదని తెలుస్తోంది. జిల్లాల యంత్రాంగం నుంచి మండలస్థాయి అధికారుల వరకు సరైన ప్రచారం లేదనేది కారణంగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వైసీపీ నాయకులు పట్టభద్రుల ఓటర్లను జాబితాలో చేర్పించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

## టపాసులు దుకాణాలను తనిఖీ చేసిన తహశీల్దార్

కోట, అక్టోబర్ 22 ప్రభాతవార్త

కోటలోని ఎన్‌సిఆర్ కళ్యాణమండంలో నిర్వహిస్తున్న టపాసుల దుకాణాలను శనివారం తహశీల్దార్ ఎ.పద్మావతి తనిఖీ చేశారు. బాణ సంచా విక్రయించే దుకాణాల వద్ద అగ్నిమాపక శకటం తిరిగేందుకు అనుకూలంగా ఉండాలని, గోదామాల్లో సామర్థ్యాన్ని మించి సామగ్రి నిల్వ ఉంచకూడదని, ఇసుక, నీరు, అందుబాటులో ఉంచుకోవాలని, మండే, పేలే పదార్థాల ,విద్యుత్ తీగలు, అగ్గిపెట్టెలు, దుకాణాల సమీపంలో ఉంచకూడదన్నారు. బాణ సంచా విక్రయ దుకాణం ఏర్పాటు చేయాలన్నా, సామాగ్రి నిల్వ ఉంచాలన్నా అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని పేర్కొన్నారు.18 ఏళ్లలోపు పిల్లను పనిలో పెట్టుకోకూడదన్నారు.

## పులికాట్ జాలర్లకు గుర్తింపుకార్డులు ఇప్పిస్తాం

– ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ, అక్టోబర్ 22 ప్రభాతవార్త



తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలం పరిధిలో ఉన్న పులికాట్ జాలర్ల కుప్పాలలో గుర్తింపు కార్డులు ఇప్పించడానికి కృషి చేస్తానని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య తెలిపారు. తడ గ్రామ పంచాయతీ కొత్తకుప్పంలో ఆయన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగాప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తుండగా, పలువురు జాలరులు పక్కనే ఉన్న తమిళనాడులో సముద్రం జాలర్ల లాగా తమకు గుర్తింపు కార్డులు ఇప్పిస్తే కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలుకూడా అందుతాయని తెలిపారు. దీనికి ఎమ్మెల్యే స్పందిం చారు. గ్రామంలో ఇంటి నివేశన స్థలాలు, పక్కా ఇళ్లు కావాలని కూడా ఈ సందర్భంగా కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కె.రఘురెడ్డి, సర్పంచ్ కె.ఆర్ముగం, జాలర్లసంఘం నాయకులు టి.కోదండం, యాలయ్య, గ్రామానికి చెందిన వినాయగం, కస్తూరయ్య, తహశీల్దార్ రామయ్య, ఎంపీడీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దీనితో తడ గ్రామ పంచాయతీలో మూడురోజుల గడప గడపకు కార్యక్రమం ముగిసినట్లయింది.

## రాహుల్‌తో దుగ్గరాజపట్నం పోర్టుకు పునాది

వాకాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త




2024లో కాంగ్రెస్ అధికారంలోకిరాగానే దుగ్గరాజపట్నం ఓడరేవుకు పునాది వేయడం జరుగుతుందని మాజీ కేంద్ర మంత్రిడా.చింతామోహన్ వెల్లడించారు. శనివారం వాకాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1978 సంవత్సరంలో ఇందిరా కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీ పెట్టిన తర్వాత ప్రజాయాత్రల అపూర్వమైన ప్రజాభిమానం చురగున్నదని, అంతకు మించి ప్రజాభిమానం అందుకొంటున్న రాహుల్ గాంధి భారత్ జోడోలో చూసానని, తాను రాహుల్ గాంధీతో పాదయాత్రలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. మంత్రాలయంలో తాను, రాహుల్ గాంధీతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే పోర్టుతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాంత రాజకీయ దిగజాల వారసులు దుగరాజాపట్నం గూర్చి మాట్లాడరేమి అని చింత మోహన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో 50 సంవత్సరాలు తరువాత అఖిల భారత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖర్గే అనే దళితుడుని నియమించినదానికి గర్వంగా ఉందన్నారు. బిజెపి పాలనలో దేశంలో వున్నా వన్నీ అమ్ముకొంటూ పోతున్నారని విమర్శలు చేసారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వున్నారు.

## క్షేత్ర స్థాయిలో పంట పొలాలు పరిశీలన

వాకాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త



పంటకాలంలో సాగుచేసిన ఈ క్రాఫ్‌ను రెవెన్యూ అధికారులతో కలిసి జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయ రెడ్డి క్షేత్ర స్థాయిలోపంట పొలాలను పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాలలో ఖరీఫ్‌కు సంబంధించి జరిగిన పంట నమోదుపై రైతులతో విచారణ చేపట్టారు. రైతులందరూ కూడా రాబోవు వరి సీజన్‌లో పంటను కూడా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉండే గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉండాలని, సకాలంలో రైతులకు ఎరువులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట వాకాడు ఏవో దీప, వీఆర్‌ఓ కాటమ్మ, లక్ష్మయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేసుకోండి

కోట, అక్టోబర్ 22 ప్రభాతవార్త

మండలంలోని ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో మారెళ్ల భవాని కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధార్‌కార్డు తీసుకొని పదేళ్లకు పైగా అయ్యిందని, ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఆధార్‌కార్డుల్లోని వివరాలు అప్‌డేట్ చేసుకోకపోతే ఆధార్‌కార్డులో ఫొటో అడ్రస్, తదితర వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి పథకాలు అందాలంటే ఖచ్చితంగా ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కోట మండలంలోని సిద్ధవరం, కోట–1 సచివాలయాల్లో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, రాఘవరాజు, నేదురుమల్లి అనితారెడ్డి, శ్రీలక్ష్మీ, శ్రీలత, రాజశేఖర్, రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్‌లో దీపావళి సంబరాలు

కుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త



స్థానిక ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్‌లో దీపావళి సంబరాలను ఘనంగా శనివారం నిర్వహించారు. విద్యార్థులు రాముడు, సీత, లక్ష్మణుడు, రావణుడు, గౌరీమాతల వేషధారణతో అలరించారు. కరస్పాండెంట్ శశికళ మాట్లాడుతూ దీపావళి పండగ ప్రాముఖ్యతనువివరించారు. కార్యక్రమంలో హెచ్ ఎంపురుషోత్తమాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వేపూరు యుపి స్కూల్‌లో సంబరాలు జరిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశయ్య, ఉపాధ్యాయులు గోకుల కృష్ణ, జయశ్రీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు

## కాలుష్య నివారణపై విద్యార్థుల ర్యాలీ

పెనుమూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:




దీపావళి పండుగ పురస్కరించుకొని బాణసంచా పేల్చరాదని, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరుతూ శనివారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు పెనుమూరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద పెద్ద బాణసంచా పేల్చవద్దని, విద్యార్థులు, చిన్నపిల్లలు బాణసంచా పేల్చడంలో అప్రమత్తంగా వుండాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ద్రాక్షాయణి, ఉపాధ్యాయులు భరతవాణి, గీత, అల్మాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు – డా॥ సుభాష్ రాజా

కుప్పం, అక్టోబర్ 22 ప్రభాతవార్త



గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని ఎన్. కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డా॥ సుభాష్ రాజా పేర్కొ న్నారు. ఇటీవల ఆయన పిహెచ్‌సి వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో శనివారం ఆయనను వైకాపా నేత జివి రమేష్, దాసేగానూరుమాజీసర్పంచ్‌నాగేష్‌ఘనంగా సత్కరించారు. ఈందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఇళ్ల వద్దకే నేరుగా వెళ్లి వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

## పిల్లలకు పారిశుద్ధ్యంపై అవగాహన పెంచడమే ఆరోగ్యరక్షక్ ఉద్దేశం

చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

పిల్లలు పరిశుభ్రంగా వుండాలంటే వారికి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించమే ముఖ్య ఉద్దేశంగా ఆరోగ్య రక్షక్ కార్యక్రమంకు శ్రీకారం చుట్టడం జరిగిందని అపోలో ప్రాజెక్ట్ సీనియర్ అసోసియేట్ వాణిశ్రీ పేర్కొన్నారు. చిత్తూరు రెవెన్యూ భవన్‌లో శనివారం అపోలో ఫౌండేషన్, అరగొండ టోటల్ హెల్త్ ఆధ్వర్యంలో డెటాల్ బనేగా స్వచ్ఛతే సేవా సంయుక్తంగా ఆరోగ్యరక్షక్ ప్రాజెక్టు ద్వారా ఉపాధ్యాయులకు ఆరోగ్య పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అసోసియేట్స్ భవ్యశ్రీ, వనిత, ఉపాధ్యాయులు, ఆరోగ్య రక్షక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షార్ తీరంలో గుర్తుతెలియని శవం

తడ, అక్టోబర్ 22 ప్రభాతవార్త: షార్ సముద్ర తీరంలో ఒక యువకుని శవం కలకలం సృష్టించింది. సుమారు 30 ఏళ్ళ వయసువున్న ఈ యువకుని వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. షార్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం దక్షిణ గేటు సమీపంలో ఈ శవాన్ని భద్రతా సిబ్బంది కనుగొని శ్రీహరికోట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ జిలానీబాషా తన సిబ్బందితో వెళ్ళ శవాన్ని స్వాధీనం చేసుకుని షార్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు తెలిపారు.

## అవంతి లేదర్ ఫ్యాక్టరీలో స్విమ్స్ పింక్‌బస్ వైద్య శిబిరం



తిరుపతినగరం, అక్టోబర్ 22 ప్రభాతవార్త: స్విమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వరదయ్యపాళ్యం మండలం, కాంబాకం గ్రామంలోని అవంతి లేదర్ ఫ్యాక్టరీలోని కార్మికులకు పింక్ బస్ క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మాట్లాడుతూ పింక్ బసు కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య ప్రధానాంశంగా భావించి ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకై క్యాంప్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరానికి అవంతి లేదర్ ఫ్యాక్టరీ సిఇఓ ఓకె కౌల్, మేనేజర్ యూసఫ్ వలి, పి.ఆర్.ఓ ఎం.ఎం.రాజు ఇతర సిబ్బంది సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ వైద్య శిబిరం ద్వారా 111మంది మహిళలతకు పింక్ బస్ ద్వార్యా వ్యాధి నిర్ధారణ పరీక్షలు మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, పాప్ స్మియర్, ఓరల్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పూజ, శ్రీత, వై.శ్వేత భావని, శ్రీజ, తేజ ప్రియ, చంద్రలేఖ, దక్షిత, అరుణ, శ్వేత, ఎ.వి.చైతన్యభాను, ఎ.డి(పిఆర్), వి.రాజశేఖర్, అరుణ, శ్వేత, పద్మజ, నాగభూషణమ్మ, కళ్యాణి స్విమ్స్ వైద్య సిబ్బంది, పి.ఆర్.ఓ.కార్యలయ సిబ్బంది, ఎం.ఎస్.డబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మయూరి టవర్స్‌లో చోరీ

**-144గ్రాముల నగలు, 4లక్షలు నగదు అపహరణ**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈదులగుంట మయూరి టవర్స్‌లో కాపురం ఉంటున్న ఓఇంట్లో చోరీ జరిగినట్లు సిఐ భాస్కర్‌నాయక్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు ఈదుల గుంటలోని శ్రీశ్రీనగర్ మయూరి టవర్స్‌లో నివాసం ఉంటున్న శ్రీధరాచారి కుటుంబ సభ్యులతో ఈనెల 9వ తేదీన కాశీవిశ్వేశ్వ రస్వామివారిని దర్శించు కునేందుకు వెళ్ళారు. కుమారుడు జ్ఞానామృత్ బిటెక్.పూర్తి చేసి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ తీసుకుంటున్నారు. శ్రీధరాచారి శ్రీకాళహస్తిలో బంగారు పని మరియు జాతకాలు చూస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీధర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 9న శ్రీధర్ కాశీయాత్రకు వెళ్ళగా 10వతేదీన బెసెంట్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ కంపెనీకి ట్రైనింగ్ నిమిత్తం హాజరుకావాలనితాను కూడా ఇంటికి తాళాలు వేసి వెళ్ళినట్లు తెలిపారు. దీపావళికి ఈనెల 24,25తేదీకి బెంగుళూరులో సెలవులు ఇచ్చినందున శనివారం ఉదయం 7.30గంటల ప్రాంతంలో శ్రీకాళహస్తిలోని తన ఇంటికి రాగా ఇంటి మెయిన్‌డోర్ తలుపులు తీసి ఉంచడంతో గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించిఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 144గ్రాములు బంగారు, 4లక్షలు నగదు చోరీచేసి తీసుకెళ్ళినట్లు బాధితుడు వాపోయారు. బంగారు చోరీ విలువ సుమారు రూ.2.88లక్షలుగా ఉంటుందని తెలిపారు. సమాచారం అందుకున్న సిఐ భాస్కర్‌నాయక్ పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం వచ్చి వేలిముద్రల నిపుణులు పరిశీలించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనాసుదూర ప్రాంతాలకు వెళ్ళేటపుడు తమకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు ఏర్పాటుచేస్తామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రెండు లారీలు ఢీ: ఒకరి మృతి



శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి-తిరుపతి రహదారిలోని ఏర్పేడు మండలం సీతారాం పేట వద్ద శనివారం వేకువ జామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొని ఓ డ్రైవర్‌మృతి చెందినట్లు సమాచారం అందింది. ఏర్పేడు పోలీసు ఎస్ఐ శ్రీహరి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌జిల్లా రామపురం గ్రామానికి చెందిన అనిల్ (23) హైదరాబాదు నుంచి తిరుపతికి సరకులు సరఫరా చేస్తున్నారు. మరో లారీ తిరుపతి నుంచి కొల్‌కత్తాకు సరకులు తీసుకెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వరంగల్ నుంచి వస్తున్న మినీ లారీ డ్రైవర్ అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో లారీ డ్రైవర్ తీవ్ర గాయాలకు గురికాగా తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీహరి వివరించారు,

## నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ఆకస్మిక తనిఖీలు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 22, ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయాన్ని శనివారం మేయర్ డా. శిరీష ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో ఉన్న అధికారులు చాంబర్లను, సెక్షన్ల రూములు, డేటా ఆఫ్ రూములు పరిశీలించి, ఆఫీసు పనివేళలో వారి వారి విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో వారి విధులకు సంబంధించి అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంను పరిశీలించి ఎవరిని లోపలికి అనుమతించవద్దని ఆదేశించారు. ప్రజారోగ్య విభాగాలు పరిశీలించి జననం, మరణం ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న వారికి త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని హెల్త్ అధికారులు ఆదేశించారు. రెవిన్యూ అధికారుల వారి చాంబర్లను, విభాగ సెక్షన్ల రూములు పరిశీలించారు. అధికారులు ఉద్దేశించి నగర పాలక సంస్థ కార్యాలయానికి వస్తున్న నగర ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ తనిఖీలో కార్పొరేటర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, నరసింహచారి, హెల్త్ అధికారి హరికృష్ణ రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతు మాధవ్, మేనేజర్ చిట్టిబాబు, డిఈ దేవిక, సూపరింటెండెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

## హరిత పటాసులను ఉపయోగించండి



తిరుపతి, అక్టోబర్ 22 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ప్రజలు హరిత పటాసులను ఉపయోగించి, సాంప్రదాయ పద్ధతుల్లో దీపావళి పండుగను జరుపుకోవాలని కాలుష్యనియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజనీర్ ఎ.నరేంద్రబాబు కోరారు. సోమవారం దీపావళి పండుగ సందర్భంగా పర్యావరణ హిత పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శనివారం తిరుపతి నగరంలో విశ్వం విద్యాసంస్థలు, పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సహకారంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అత్యధిక శబ్దాలను, రసాయనాలను వెదజల్లే విపరీతమైన శబ్ధ, వాయువకాలుష్యం ఏర్పడుతుందన్నారు. వృద్ధులు, పిల్లలు, ఆరోగ్యసమస్యలున్నవారు, మూగజీవాలపై తీవ్ర ప్రభావం చూపించి వారి ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం పడుతుందన్నారు. దీపావళి పండుగ రోజుల్లో జరిపే గాలి నాణ్యతా పరీక్షల ద్వారా ఈ ప్రభావం 15రోజుల వరకు సామాన్యపరిస్థితులు గాలి నాణ్యత ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత టపాసులను పేల్చి దీపావళి జరుపుకోవాలని నరేంద్రబాబు కోరారు. ఈ ర్యాలీలో విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాధరెడ్డి, కాలుష్యనియంత్రణమండలి సహాయ పర్యావరణ ఇంజనీర్ ఎం.శశికళ, సైంటిస్ట్ సుధాకర్, ఆర్.కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

# చెరుకు రైతుల బకాయిలు ప్రభుత్వమే చెల్లించాలి

**రైతు సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి**



నింద్ర, అక్టోబరు 22 ప్రభాతవార్త : నేథమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల బకాయిలు ప్రభుత్వమే చెల్లించాలని ఫ్యాక్టరీ రైతు సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నేథమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులు తిరుపతి చెన్నై జాతీయ రహదారిపై రాస్తారోకో ధర్నా చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు చెల్లించవలసిన బకాయిలు 37కోట్ల చెల్లించకుండా సుమారు నాలుగు సంవత్సరాలుగా రైతులను యాజమాన్యం మోసం చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. బకాయిల విషయంగా స్థానిక ఎమ్మెల్యే ఆర్‌కె రోజా, అసిస్టెంట్ కేన్ కమిషనర్, కలెక్టర్ వద్దకు అనేక పర్యాయాలు వెళ్ళినా న్యాయం జరగలేదని అన్నారు. నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్ నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు రాత్రి, పగలు కష్టపడి చెరుకు పంట పండించి ప్యాక్టరీకి చెరుకు సరఫరా చేస్తే రైతులకు చెల్లించవలసిన బిల్లులు ఇంత వరకు చెల్లించకుండా యాజమాన్యం మోసం చేస్తుందని విమర్శించారు. రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ చెరుకు సరఫరా చేసిన రైతుల వద్ద నుంచి టన్నుకి ఐదు రూపాయలు చొప్పున గత రైతు నాయకులు వసూలు చేసిన వాటిని రైతులకు ఇంత వరకు లెక్క చెప్పకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. నగరి ఆర్డీఓ సుజన మాట్లాడుతూ నేటమ్స్ షుగర్ ప్యాక్టరీ చెరుకు రైతులకు చెల్లించవలసిన బకాయిల విషయంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్ళి తొందరగా పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. తిరుపతి చెన్నై జాతీయ రహదారిపై రైతుల గంటసేపు రాస్తారోకో, ధర్నా చేయడంతో నగరి రూరల్ సిఐ రాజశేఖర్ చాకచక్యంగా మాట్లాడి విరవింప చేసారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కేన్ కమిషనర్ జాన్‌విక్టర్, తహశీల్దారు అమరేంద్రబాబు, చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు ధశరధ వాసు, జిల్లా రైతు సంఘ అధ్యక్షులు జనార్ధన్, టిడిపి మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు గాలి రమేష్ నాయుడు, గంగాధరంనాయుడు, రాధాక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్రాంచ్ కెనాల్ పనులు సత్వరం పూర్తికి పక్కా చర్యలు



చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త: కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు త్వరితంగా పూర్తి చేయడానికి నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటున్నామని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. జాయింట్ కలెక్టర్ సమావేశభవనంలో శనివారం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు సంబంధించిన భూసేకరణలో కోర్టును ఆశ్రయించిన రైతులతో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌లు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పం బ్రాంచ్ కెనాన్ పనులు త్వరితంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటున్నారన్నారు. ఈ బ్రాంచ్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణలో కోర్టును ఆశ్రయించిన రైతుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి చర్యలు తీసుకొంటున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు త్వరితంగా పూర్తి చేయడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ పనులను త్వరితంగా పూర్తి చేసి రైతులకు నీరు అందిం చడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో వుందన్నారు. ఈ పనులు పూర్తి చేయడంలో వున్న సమస్యలపై కోర్టును ఆశ్రయించిన రైతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నియమ నిబంధనల మేరకు ఫాస్ట్ ట్రాక్‌లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. అవార్డు పాసైన వారికి నాలుగు వారాల్లో 19 కోట్ల రూపా యలు మంజూరు అయ్యే అవకాశం వుందన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు 88 శాతం పూర్తి అయ్యాయని, పెండింగ్‌లో వున్న పనులు పూర్తి చేయడానికి కోర్టు పరిధిలో వున్న వాటిలో రోడ్డు ప్రక్క వున్న భూములకు రీఅవార్డుకు అవకాశం వున్న భూములు, ఎన్యుమరేషన్ విషయాలను పూర్తి స్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ రాజగోపాల్, ఇఇ సురేష్ బాబు, డిఇ హుస్సేన్, జిసెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రాక్షస పాలన రాజ్యమేలుతోంది

**-మాజీ మంత్రి అమరనాథరెడ్డి**



పలమనేరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఆటవిక, రాక్షస పాలన రాజ్యమేలుతోందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి దుయ్యబట్టారు. వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై శనివారం ఆయన మాట్లాడుతూ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి 43 నెలలైనా ఇంత వరకు నిందితులను పట్టుకోలేకపోవడం, కేసు విచారణలో సిబిఐకు సహకరించకపోవడం, ముదాయిలకు ఏపీ పోలీస్ వ్యవస్థ అండగా నిలవడం, సిబిఐ విచారణ కోరుతూ కోర్టులో వేసిన పిటీషన్‌ను జగన్ రెడ్డి వెనక్కి తీసుకోవడం వంటి ఘటనలన్నీ చూస్తే ఈ కేసులో జగన్‌రెడ్డి ప్రమేయాలను ఎత్తి చూపుతున్నాయన్నారు. హత్య కేసు ముదాయిలను పట్టుకోవాలన్న ఆలోచన ఏపీ ప్రభుత్వానికి లేదని, అసలు ముద్దాయిలను కాపాడుతున్న అదృశ్య శక్తి ఎవరు జగన్‌రెడ్డి అని ప్రశ్నించారు. ఈ కేసు విచారణను ఈ రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని సిబిఐ కోరిందటే ఎంతగా ముఖ్యమంత్రి దెబ్బకు భయపడి ఉంటుందో చెప్పాల్సిన పని లేదన్నారు.

## బడికి వెళ్లాలంటే బురద తొక్కాల్సిందే.

**- 3కిలోమీటర్ల దూరమున్న పాఠశాలకు విద్యార్థుల నడక - గుంతలమయమైన రోడ్డు**



పెద్దపంజాణి అక్టోబర్ 22 ప్రభాతవార్త : బుడిబుడి అడుగులు వేస్తూ చిన్నారులు బడికి చేరాలంటే బురద తొక్కాల్సిన పరిస్థితి మండలంలోని చలమంగళం పంచాయతీ ముద్దేపల్లి విద్యార్థులకు కష్టంగా మారింది. ఈ గ్రామం నుండి సుమారు 50మంది దాకా పిల్లలు ముద్దేపల్లి నుంచి చలమంగళం, పెద్ద పంజాణి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు చేరుకోవాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు కురవడంతో రోడ్లన్నీ కొంతమేర దెబ్బతిన్నాయి. పెద్దపెద్ద గుంతలు రోడ్లలో ఏర్పడి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి దీనికితోడు గుంతలనిండా నీరుచేరి బురద మయంగా మారిపోయింది. ఈ మార్గంలోనే విద్యార్థులు నడుచుకొని బడికి వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఈ మార్గంలో వాహనాలు ప్రయానించాలంటే సైతం తీవ్ర అవస్థలను వాహనదారులు ఎదుర్కొంటు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మర్మమతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## జడ్పీ ఛైర్మన్‌కు సిఇఓ దీపావళి శుభాకాంక్షలు



చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త: జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులుకు శనివారం ఆయన ఛాంబర్‌లో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులును శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిడినెల్లూరు ఎంపిడిఓ శ్రీదేవి, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ షణ్ముగరామ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వంట గ్యాస్ డెలవరీ వాహనం ప్రారంభం



చిత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త: పోలీసు సంక్షేమంలో భాగంగా శనివారం ఏఆర్ డిఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి పాత జిల్లా పోలీసు కార్యాలయంలో వంట గ్యాస్ డెలవరీ వాహనంను జెండా ఊపి ప్రారంభించారు. పోలీసు కుటుంబాల సంక్షేమం దృష్ట్యా ఇంటింటికి పోలీస్ గ్యాస్‌ను సరఫరా చేయడానికి గ్యాస్ డెలివరీకి అనుగుణంగా అన్ని హంగులతో ఏర్పాటు చేయడం జరిగిందని డిఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ అడ్మిన్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంటిఓ ఆర్ఓ మధు, ఆర్ఎస్ఐలు మంజునాధ్, శ్రీను, రామ్మోహన్‌లు, జిల్లా పోలీసు సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, పోలీస్ గ్యాస్ ఇన్‌ఛార్జ్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



కాణిపాకం, అక్టోబర్ 22 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు గుంటూరు జిల్లా తాడేపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి అనే భక్తుడు ఈమొత్తాన్ని విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తా న్ని కుటుంబ సభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



తవణంపల్లె, అక్టోబర్ 22 ప్రభాతవార్త: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరిత్యా నేరమని ఆరోగ్య విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కె.పట్నం గ్రామంలో జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరినాధరెడ్డి ఆధ్వర్యంలో లింగ వివక్షత చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జనాభాలో స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా వుండాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని తెలిపారు. ప్రభుత్వంచే అనుమతించబడిన స్కానింగ్ కేంద్రాలు గర్భవతులకు ఆరోగ్య సమస్యలు, జన్యుపరమైన సమస్యలు, బిడ్డ ఎదుగుదల తెలుసుకునేందుకు మాత్రమే లింగ నిర్ధారణ పరీక్షలు చేయాలని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధరణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. దీనిపై ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు నిఘా వుంచాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయ చైదరి, సీహెచ్ఓ భార్గవి, నాగభూషణమ్మ, సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

## రక్తదానం చేస్తే.. మరో జన్మ ఇచ్చినట్లే:ఎస్పీ



తిరుపతి క్రైం, అక్టోబర్ 22, ప్రభాతవార్త : రక్తదానం చేస్తే.. మరో వ్యక్తికి జన్మ ఇచ్చినట్లే అని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసులు రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేసారు. ముఖ్య అతిధిగా ఎస్పీ హాజరయ్యి రక్తదానం చేశారు. ఎస్పీలు సుప్రజా, కులశేఖర్, విమాలకుమారి, పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు స్థానిక ప్రజలు పాల్గొని 120 రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ రక్షణలో సైన్యం ముఖ్యపాత్ర పోషిస్తుందని కొనియాడారు. ఎంతో మంది పోలీసులు అమరులైనారని వారి త్యాగాలు ఎన్నటికి మరువులేనదన్నారు. ప్రజల శాంతి భద్రత విషయంలో ప్రాణాలు అర్పించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ నెల 26 నుంచి ఐదు రోజులు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేస్తామన్నారు. స్కూల్ కాలేజీలలో వ్యాసరచన పోటీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుప్రజా, కులశేఖర్, విమలకుమారి, పోలీస్ యూనిట్ డాక్టర్ కవిత, డీఎస్పీలు నరసప్ప, చంద్రశేఖర్, నందకిషోర్, ఆర్ఐలు రెడ్డప్ప, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీలు చేస్తే చర్యలు : జిల్లా ఎస్పీ



తిరుపతి క్రైం, అక్టోబర్ 22, ప్రభాతవార్త: పోలీస్ స్టేషన్లో అధికారులు సిబ్బంది పంచాయితీలు చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. నెలవారీ నేర సమీక్ష సమావేశం పోలీస్ అధికారులతో ఎస్వీ యూనివర్శిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అవినీతికి తావు లేకుండా పనిచేయలని సూచించారు. విధులు నిర్వహించాలని పోలీసు శాఖకు చెడ్డ పేరు తీసుకురాకూడదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంరక్షణ కార్యదర్శి ఏర్పాటు చేసిందని వారి వద్ద నుంచి ఆశించిన స్థాయిలో పనిచేసుకోవాలని సూచించారు. అధికారులు పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించాలని సూచించారు. నేషనల్ హైవే రోడ్డు ప్రాంతాలలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అవినీతికి పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు సుప్రజా కులశేఖర్, విమల కుమారి, మునిరామయ్య, డీఎస్పీలు సిఐలు పాల్గొన్నారు.

# మనం బతుకుతూ ఇతరులకు బతుకుదెరువు చూపాలి : రాజేష్‌రెడ్డి





రేణిగుంట, అక్టోబరు 21 ప్రభాతవార్త: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న దృఢ సంకల్పంతో ముందుకు దూసుకుపోతున్న యువనేత రొమ్మాల రాజేష్‌రెడ్డిని అందరూ అభినందిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. రాజేష్‌రెడ్డి పుట్టిన రోజు ఆయనకు ఒక్కరికే కాదు ఆ గ్రామం అంతా పండగే. నిరుపేదలకు బట్టలు, స్వీట్ బాక్సుల పంపిణీ, అన్నదానాలు, అన్ని దగ్గరుండి జరిపిస్తారు. ఇంట్లో, హోటల్లో, ఫంక్షన్ హాలుల్లో కేక్ కట్ చేసుకుని పుట్టిన రోజు జరుపుకుంటే అది మన వరకే ఉంటుందని అందరి మధ్య జరుపుకుంటే వారి దీవెనలే తనకు శ్రీరామరక్షగా ఉంటాయన్నది రాజేష్‌రెడ్డి అభిప్రాయం. రేణిగుంట మండలం కొత్రమంగళం గ్రామానికి చెందిన రొమ్మాల రాజేష్‌రెడ్డి చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు రొమ్మాల లలితరెడ్డి, రొమ్మాల భాగ్యశేఖర్‌రెడ్డిల పెంపకం, క్రమశిక్షణ అయను యువ నాయకునిగా తీర్చిదిద్దాయి. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా వారిని వివిధ రకాలైన ఆటల పట్ల ఆసక్తి పెరిగేలా క్రికెట్ తదితర కిట్లు అందజేసి క్రీడల పట్ల ఉన్న అభిమానాన్ని సమాజంలో పౌరునిగా తన ధర్మాన్ని చాటుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి తిరుపతి రూరల్ మండలం తనపల్లి క్రాస్ వద్ద అత్యాధునిక యంత్రాలతో సురేష్ ఫుడ్, బ్రేవరైజర్స్ యూనిట్‌ను ప్రారంభించారు. పార్టీలకతీతంగా పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆయన తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నారు. ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే ప్రతి వ్యక్తిలోనూ అంతర్గతంగా ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ప్రతిభను వెలికి తీయడానికి సాధన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానులన్నారు. తారతమ్యం బేధాలు మనం సృష్టించుకున్నవేనన్నారు. యువకులు ముందుకు వచ్చి చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి ఎంతో మంది ఉద్యోగ యువతకు ఉద్యోగ అవకాశ్యాలు కల్పించాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రజాసేవ చేయాలంటే ప్రజాప్రతినిధులు కావాల్సిన అవసరం లేదని ఏ విధంగానైనా ప్రజాసేవ చేయవచ్చుననే నమ్మకం తనకున్నదన్నారు. అందులో భాగమే తాను చేస్తున్న ప్రయత్నాలన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో అనుకున్న పనులను ఇష్టపడి చేస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. యువత రాజేష్‌రెడ్డిని మార్గదర్శిని చేసుకుని ఆయన బాటలో పయనిస్తే అనుకున్న ఫలితాలు అంతకు మించిన లాభాలు సాధిస్తారు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## రెండేళ్ళ తరువాత స్వర్ణముఖి హారతులకు ముస్తాబు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం జీవనది పవిత్ర స్వర్ణముఖి నదిలో రెండేళ్ళ తరువాత 'స్వర్ణమ్మకు' హారతులివ్వటానికి సన్నాహాలు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పట్టుబట్టి స్వర్ణమ్మ హారతుల కార్యక్రమాల్ని ఏర్పాటు చేసారు. అయితే రెండేళ్ళ పాటు కరోనా, నదిలో నీరులేక పోవటంతో స్వర్ణమ్మ హారతులను నిర్వహించలేదు. ఈ సందర్భంగా ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అదికారులతో కలసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈసందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ హారతులు నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. మూడురోజుల్లో కార్తీక మాసం ప్రారంభం కానున్నదని వివరించారు. అప్పటి లోపల నదిలోని వ్యర్థాలను తొలగించుటకు, పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ప్రక్షాళన చేయుటకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్తీక మాసం నదికి వరద వచ్చే అవకాశం ఉన్నందువల్ల అప్పటి లోపల నదిని ప్రక్షాళన చేయటానికి సిద్దం చేసామన్నారు. ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయాధికారులు చర్చించారు. కాంట్రాక్టర్ రాఘవరెడ్డి పరిశుభ్రం చేయటానికి సుముఖత వ్యక్తం చేసారని వివరించారు. కాంట్రాక్టర్ నది ప్రక్షాళనను ఉచితంగా చేసి పెట్టడానికి ముందుకు రావటం ఆయనలోని భక్తి భావానికి నిదర్శనం అన్నారు. ఈ పనులకు భూమి పూజలు నిర్వహించామని ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. ఈ కార్యక్రమాల్లో బోర్డు సభ్యులు సాధనమునస్వామి, అలయాధికారులు స్తపతి కుమార్, వైకాపా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవి, కుమారస్వామి, నరసింహులు, కాంట్రాక్టర్ రాఘవరెడ్డిలు పాల్గొన్నారు.